పునర్జన్మ

విజయ — రాఘవ

గడియారం మూడు గంటలు కొట్టింది.

మధు తలెత్తి చూశాడు.

పెండ్యులం బరువుగా వూగుతోంది.

మధు ఒక్క నిట్టూర్పు బరువుగానే వదిలాడు. ఎలాగో గతాన్ని విస్మరించి, మళ్ళా పనిమీదకు ధ్యాస పోనిచ్చాడు.

ఇంతలోనే ట్రేలో మరికొన్ని కాగితాలొచ్చి పడ్డాయి.

మధు వాటి వంక చూస్తూ కుదేలుమన్నాడు. "టపాకు పోవలసినవి, అర్జంటుగా యెన్నివున్నయి!" అని భయం వేసింది.

ఆ భయాన్ని అలాగే అణగార్చుకొని ఒక్క వుత్తరాన్ని సగం టైపుచేసేటప్పటికి—నిష్కారణంగా కలరా తగిలి చనిపోయిన తల్లి గుర్తొచ్చింది మధుకి. రెండు కళ్ళూ అశ్రుపూరితాలయినయి చేతి వ్రేళ్లలో బలంతగ్గి, నీరసంతో ఆగిపోయినయి.

మరపురాని అనుభూతులు ఒకదాని తరువాత మరొకటి తోసుకొస్తున్నయి—

"రాత్రింబవళ్లు ఆఫీసర్ల మెప్పుకోసం, నానా అవస్థలు పడి, పీనుగులాగా మొగం పెట్టుకొని యింటికొచ్చేటప్పటికి, తనపై సానుభూతిగా, జాలిగా—ప్రేమగా—వాత్సల్యంగా — తననిపల్కరించి,— వేన్నీళ్లు తోడిచ్చి, వేడి వేడిఅన్నం పెట్టి, కడుపులో దాచుకొనే తల్లి! ప్రాణంలో ప్రాణమై, దేహంలో దేహమై, చూపులో చూపై. మాటలో మాటై, పెంచింది. చదువు చెప్పించింది — డబ్బుగలవాళ్ల యిండ్లలో వంటలు చేసిపెడుతూ, నీళ్ళు తోడిపెడుతూ.

వాళ్లనే మాటలన్నీ, తనకోసం, తన బాగుకోసం బాధ్యురాలై భరాయించింది. ఎంత గడ్డితిని, తనని బ్రతికించినా, తనకీ వుద్యోగం వచ్చేటప్పటికి పట్టరానంత ఆనందం కట్టలు తెంచుకొని పొర్లింది.

ఎన్నోవిధాల తన్ను ఆమె దీవించింది

మధు యింకా మరచిపోలేడు. ఎలా మరుస్తాడు? తనకు బుద్ధి తెలిసినప్పటినుంచి యీ లోకంలో ఆత్మబంధువుగావుంది అమ్మ ఒక్కతే. ఆ వొక్కతీ యీ నాడు రుద్రభూమిలో నిద్రపోతోంది.

మధు మాత్రం జీవచ్ఛవంలాగా యీ ఆఫీసులో రెమింగ్‌టన్ ముందు ఓడిపోయిన రౌతు మొగం వేసుకొని కూర్చున్నాడు.

ఆలోచనలు క్రమేపీ విడిపోతున్న సమయంలో మధు చేతివ్రేళ్లు చూసుకొన్నాడు.

అవి సమ్మెచేస్తున్నట్లుగా వున్నాయి

ప్రయత్నించి చూసాడు కొద్ది నిముషాలు.

అర్థంకాని మాటలు పడ్డాయి. చివాట్లు తప్పవనుకున్నాడు మేనేజరుతో. ఇవాల్టితో యీవుద్యోగానికి స్వస్తియేమో! అనుకొన్నాడు. ఎంతో ప్రయత్నించాడు. మనస్సుని సరిగ్గా తిప్పుకొంటానికి యేం ప్రయోజనం లేకపోయింది ఈ ప్రయత్నాన్ని పురికొల్పేబదులు బాధాకరమైన ఆ ఆలోచనల్లోనే చాలాహాయి వున్నట్లు తోచింది మధుకి. నరాల సత్తువ సన్నగిల్లింది. తన అశక్తికి తానే నిందించుకొన్నాడు. టైపుమిషన్ మీద నుదురు పెట్టి యేడ్వటం ప్రారంభించాడు.

ఈ యేడుపు హఠాత్తుగా ప్రక్కనే వున్న మూర్తిని కంగారు పెట్టింది. అతను మధుని తట్టుతూ, "ఎందుకురా! యేడుస్తున్నావ్" అన్నాడు. జేవురించిన మొగంతో మధు తలెత్తి చూశాడు. కూర్చుంది ఒక ఆఫీసులో. ఆఫీసులో యింటికష్టాల్ని గురించి, వ్యక్తి సంబంధమైన బాధల్ని గురించీ, తెల్పుకోగూడదని, తన బ్రతుకంతా సర్వదా యీ టైపుమిషన్‌కి బానిసగా వుండి పోవడమేనని జ్ఞాపకానికి వచ్చింది. యిరవై అయిదు సంవత్సరాలువున్న తను, యెంతో అనుభవం గడించుకొని, అనేక విధాలుగా కష్టనష్టా

లతో బ్రతుకుతూ వస్తున్న తన వ్యక్తిత్వం సామాన్యుని యేళ్ళకన్నా హీనంగా వున్నా, యింతమంది వున్న ఆఫీసులో యేడ్వటం, మధుకి తీరని అవమానమనిపించింది. తన కష్టాలు గురించి చెప్పితే యెవడు వింటాడు యీ లోకంలో? తనలాంటివాళ్ళు యెంతమందిలేరు' తనకన్నా గొప్పవాళ్లే వున్నారు. ఈ యేడ్పుకి యే విధంగానూ అర్థంలేదనిపించింది. ఎందువల్లనంటే, కాలం మారిపోయింది. నాగరికతకు అంతస్థులు పెరిగినయి. సభ్యతకు కావలసిన గౌరవ ప్రతిష్ఠలు యీనాడు సంఘంలో లభ్యంకావటం లేదు — అందువల్ల "ఒకరి కష్టాలు మరొకరికి ఆనందం — మరొకరి నష్టాలు వేరొకరికి బ్రహ్మానందం."—

పంచెకొంగుతో కారిన కన్నీళ్లను తుడుచుకొంటూ "ఏం లేదురా"—అన్నాడు మధు.

"అదేమిటిరా...అలా నీళ్లు కారుతుంటే!"—

"వేడి చేసిందిలే—అన్నాడు మధు. తనలోని బలహీనత యెక్కడ బయటపడిపోతుందో అని, సభ్యతకులో టెక్కడ దాపురిస్తుందో అని. మూర్తికి చిన్న నవ్వువచ్చింది. అది యెంతో సేపు నిలుపుకోకుండానే తన పనిలోకి తానుచొచ్చుకు పోయ్యాడు.

ఇన్నాళ్లు భారమనిపించని జీవితం—జీవనం మధుకి ఒక్కసారిగా విసుగుని — చిరాకుని కలిగించాయి. ఆ పూటకు పనిమీద ధ్యాసపోయింది. తల్లి మూర్తి కన్నులముందు లాస్యం చేస్తున్నట్లుగా వుంది. అట్టే ఆలోచిస్తున్న కొద్దీ యీ లోకమే వెగటనిపించింది.

సన్ని వేశాలు — సంఘటనలు — సమాలోచనలు చాలావరకు జీవితంలో మార్పుని తేస్తూ వుంటయి కాని, వీటిని గురించి ముందుగా చాలా ఆలోచిస్తాం. యిది తెప్పించే చెరుపు — బాధ — విచారమూ — ఫలించనప్పుడూ, కుదురనప్పుడూ మరీ దుర్భరంగా వుంటుంది హృదయం.

కలరావచ్చి చనిపోయినతల్లికి దహనక్రియలు జరిపి అయిదారు నెలలు కావస్తున్నది. కాని మధు దృష్టిలో యీవిషయం జరిగింది కొద్ది గంటల క్రితమే అన్నట్లు వుంది.

ఇటువంటి అవిరళమైన ఆలోచనలే అతని హృదయాన్ని పీల్చి పిప్పిచేస్తున్నయి. చీటికి మాటికి మలేరియాజ్వరం అతని ఆరోగ్యాన్ని రుచిమూసి పోతూ వుంటుంది.

అటువంటప్పుడు సలసల కాగిపోతూ వుంటుంది శరీరం. మృదువుగా తాకి, జ్వరాన్ని ఉపశమింప చేయడానికి అనువైన కోమల హస్తాలు తన కీలోకంలో కరువై పోయినాయేమో!" అని మధు మధనపడుతూ వుండేవాడు.

ఇంతలో గడియారం నాలుగున్నరను సూచిస్తూ ఒక గంట కొట్టింది.

మధు అదిరిపడ్డాడు.

మానవుడు కోరుకొంటున్న కనీసపు కోర్కెల్లో కూడా తన కేవిధంగానూ అనుకూలించని భాగ్యంతొలగిపోయింది."

కన్నీరు ఆపుకున్నా ఆగటం లేదు.

ఇంతలో ప్యూన్ వచ్చాడు మధు దగ్గరికి.

"ఏమిట"న్నట్లు చూశాడు మధు,

"మేనేజరు పిలుస్తున్నారు?" అన్నాడు ప్యూన్.

మధు పిల్లిలాగా, చొక్కాతో మొఖం తుడుచుకొని మేనేజరు గదిలోకి ప్రవేశించాడు. ఎదురుగా వెళ్లి వంగి నమస్కారంచేసి నిలబడిన మధుని చూసి—

"ఎప్పుడూ అదోమాదిరిగా వుంటావేమిటోయ్?" ఉషారుగా వుండవేమిట? ఏమైనా జబ్బుగా వుందా, అని ఎక్కిరి తక్కిరిగా ప్రశ్నించాడు మేనేజరు. మధుకి గొంతుకలోకి యేడ్పు ముంచుకొచ్చింది.

"మధ్య మలేరియా తీవ్రంగా వొస్తోంది...ఆరోగ్యం కూడా చెడిపోతోంది. దయచేసి ఒక పదిహేను రోజులు సెలవిప్పిస్తే మీ పుణ్యముంటుంది బాగుపడతా!" అని మధు ప్రాధేయపడ్డాడు.

మేనేజరుకి యిదేమీ సుతరామూ గిట్టలేదు.

"నీకు పదిహేను రోజులు సెలవిచ్చి, నీస్థానంలో మరొకణ్ని వేసి, మళ్లా నువు రాంగానే వూడబెరికితే వాడేమైపోను—?" ప్రశ్నార్థకంగా అన్నాడు మేనేజరు.

మధుకి యేదో సమాధానం నిశ్చలంగా—దృఢంగా చెప్పవలెననిపించింది.

రెండడుగులు ముందుకి వేస్తూ—"అయితే నాఆరోగ్యం చెడగొట్టుకో మంటారా?"—అన్నాడుదీనంగా— అందులోని వాస్తవాన్ని మేనేజరు యేమీ గుర్తించలేకపోయాడు.

"అదంతా నాకేం తెలియదు. నేను సెలవు యివ్వను. ఇష్టముంటే యీ వుద్యోగం చెయ్యి—లేకపోతే నీయిష్టం..." అని మిగతా భాగం మధుకి వదిలివేసి మేనేజరు ప్రక్క గదిలోకి లేచిపోయాడు.

మధు యివతలికి వచ్చాడు. కాసేపు చేతి వేళ్లు జుట్టులోకి దూర్చి, యేదో ఆలోచించాడు. ముందు ముందు కష్టాలెటువంటివి తన జీవితానికి అడ్డు తగులుతూంటయ్యో అతని కేమీ వూహలో తట్టలేదు—వంగిపోయిన తలను విసురుగా ఒక్కసారి "మేనేజరు" అన్న యింగ్లీషుబోర్డు వంకకు తిప్పి—" ఇంతేగా నువ్వు చెయ్యగల్గింది. కాని. అంతమాత్రానికి నేనేమీ నాశనంకాను. ఈ రోజునుంచి నీ ఆఫీసుకు, నీ రెమింగ్‌టన్ మిషన్‌కి నీళ్లధార వగులుకొంటున్నా" అని దీనంగా సమాధానమిస్తూ ఆఫీసు మెట్లు దిగి బజార్లోకి పడ్డాడు.

రణగొణధ్వనుల మధ్య మధుకి మతిపోతున్నట్లు అనిపించింది. గానుగెద్దులాగా కాళ్లీడ్చుకొంటూ సరాసరి యింటికొచ్చి చేరాడు — అయిదునిముషాలనంతరం గదిలోకి వెళ్లి పడుకొన్నాడు. "ప్రపంచంలో ప్రతి వస్తువు తన్నుచూసి హేళన చేస్తున్నట్టనిపిస్తుంది! ఎందు కనపించదు మరి! ఎవరైనా నా 'అనేవాళ్లుంటేగా! తనకు కల్గుతూంటే కష్టాలలోగల దుఃఖాన్నీ, సుఖాలలోగల ఆనందాన్నీ తనకున్న వొక్క హృదయమే భరించాలి. తను ఏకాకి.

జరిగిపోయిన మధురక్షణాలు అనేకం స్మృతిలో మెదిలినయి—

చనిపోయిన తల్లి వెతికి వెతికి ఒకమ్మాయిని, తెచ్చి పెళ్లి చేసుకోమని కోరింది. ఆ కోరికను చెల్లించవలసిన బాధ్యత తనకుంది. ఆమె సంతోషమేగా తన సంతోషం! అమ్మ మాటకు ఎదురు చెప్పకుండా అంగీకరించాడు. శుభముహూర్తం నిశ్చయించకముందే మాయదారి కలరాకు అమ్మ బలి అయిపోయింది. తరువాత పిల్లవాళ్లు తన కివ్వడానికి తిరస్కరించారు. ఒకందుకు తనకిది మంచిదనే భావించాడు మధు. రోజులు నానాటికి గడుస్తున్నకొద్దీ యీ లోకానికి తనెంత పనికిరాని వెధవైపోయాడో తెలిసివచ్చింది.

ఉద్యోగం తన అప్రయోజకత్వంతో వూడిపోవడం, బ్రతకడం అంటే బరువుని భుజాలమీదకు ఎత్తుకుని బ్రతికినంతకాలం మోయడం, అతన్ని అయోమయం చేసినయి. ఉద్యోగం దొరికిన క్రొత్తలో యావజ్జీవితం తల్లి పాదాలకు అంకితం చేదామనుకొన్నాడు. కాని మధుపట్ల విధి దురదృష్టాన్ని వ్రాసిపెట్టిపోయాడు. దాని ప్రభావంవల్లనే మధు జీవితంలో బొమ్మజెముడు మొక్కలు మొలిచినయి. నెలరోజులూ కష్టపడిన దంతా ఒకటవ తారీఖున ఫలించేది. ఆ సాయంత్రానికే, హోటల్ మేనేజరు, చాకలివాడూ, యింటి అద్దెవాడూ గుంజుకొనేవారు ఆ కాస్త ఫలితాన్ని. తరువాత చేతులు ఖాళీ అయి చల్లబడిపోయేవి.

జీవితంలో అసలు సంతోషమూ, ఆనందమూ, యెప్పుడూ — యెన్నడూ వుండవు. వాస్తవంగా ప్రతిదీ నాదనుకునే యీ లోకంలో మోయలేని భారాన్ని మోస్తున్నప్పటికి, అది క్రమేపీ చప్పబడుతూ వుంటుంది. తనవంటి మానవునికన్నా. పక్షులూ - జంతువులూ చాలావరకు నయమేమో ననిపిస్తుంది. ఒకరికన్నా మరొకరు బాగా బ్రతుకుతున్నారనుకొంటాం. ఎవర్ని ఉద్ధించడానికి?

ఇలా వుద్యోగం పోయిన రెణ్నెల్లకు మధులో వివిధ రకాల భావాలు చెలరేగుతూ వస్తున్నయి. వీటికి యెక్కువగా దోహదక్రియలు జరిపింది అతన్ని వెంటాడుతున్న మలేరియా జ్వరం. దానిమూలంగా మధు మొగం పాలిపోయి, కళా విహీనంగా తయారైంది. తినాలనుకున్నంత దొరకదు. తింటే హరాయించుకొనే శక్తి లేదు. ఉచితంగా మందు లిచ్చి పోయే ప్రాణాన్ని నిలిపే డాక్టర్లు తన కెవ్వరూ లేరు. ఉన్నా వాళ్ల దగ్గరకు వెళ్లడానికి సాధ్యంకాదు. రోజురోజుకి తనలో 'చావు' అనే అభిప్రాయం బలిసిపోతూ వస్తోంది. యెప్పుడది హఠాత్తుగా వచ్చి తన్ను ఆలింగనం చేసుకొంటుందో మధుకి పాలుపోవడం లేదు. తనకుతానై చావడం సుఖంగా కనిపించదు! చచ్చిపోవడానికి యీలోకంలో చాలా మార్గాలున్నాయి. రైల్లూ, కార్లూ, ఎలక్ట్రిక్ తీగలూ — ఉరిత్రాళ్లూ వగైరా. కాని అవి అనుకున్నంత తేలిక పనులుకావు మధు చావులోకూడా సుఖం కావాలని కోరుకున్నాడు. ఇది యెలా సాధ్యం? యెప్పటికైనా అంకిత మివ్వక తప్పదు. చివరకు కోరేదే అది తను. అందుకని సుఖముగా చావాలని కోరుకోవడంలో మధుకి కనిపించిన తప్పేమీ లేదు. ఒక చోట వుండి, మరొక చోట వుండే హాయిని, సౌందర్యాన్ని, కోరుకోవటం మానవుని సహజ లక్షణాల్లో ఒకటి. దీనికి యెడతెగని

ఆలోచనలు పుట్టుతూ వుంటయి, తరిచి, తరిచి ఆలోచిస్తాం. అలాగే ఆలోచించాడు మధు. చివరకు చావంటే యిష్టమనేది ఒక్కొక్కసారి సన్నగిల్లిపోయింది. అందుకని యెక్కువగా ఆ ఆలోచనల్ని తప్పుకోలేదు మధు. ఒక్కసారిగా వెలుపలికి వచ్చాడు గదిలోనుంచి.

లోకం అంతా కాటుకవంటి చీకట్లో మునిగిపోయి మూల్గుతోంది. గదికి గట్టిగా తాళం వేశాడు. గుమ్మాల్ని దాటి పెద్ద రోడ్డెక్కాడు — జనం రద్దీ అంత బాగా లేదు.

మెల్లగా తలవంచి నిర్భయంగా అడుగులో అడుగు వేసుకొంటూ నడుస్తున్నాడు. "చావాలి" అన్నమాట హృదయంలో తలెత్తి వింతగా నవ్వుతోంది. "ఎలా చావాలి"? మధుకి పరిష్కారం కావటం లేదు. "ఎలాగైనా సరే! చావు కోరుకుంది. మధు పిచ్చి కుక్కలాగా తలెత్తి యెదురుగా చూసాడు. ఒక చిన్న కారు వడిగా—వడివడిగా, త్రాచుపాములాగవస్తోంది. దానిముందు లైట్లు తన కళ్ళలో సూదులు పొడిచినట్లు పొడుస్తున్నాయి.

గుండె రాయిగా యిదివరకే మారిపోయింది. వెనక్కి కట్టుకున్న చేతులు పూడిపోయి స్వస్థానంలోకి వచ్చి చేరాయి.

పిక్కల్లో వున్న సత్తువనంతా ఉపయోగించుకొని మధు, ఆవస్తున్న కారు ముందు చక్రాలక్రింద మెత్తగా పడుకుందామని, అడ్డంగా ఉరికాడు.

క్షణం కాలం వులిక్కిపడి లేచింది.

చిన్నకారు బ్రేకుపడి రోడ్డుప్రక్కగా పెట్టబడివుంది. దూరంగా వున్న కొంతమంది దగ్గరగా వచ్చిచేరారు. అప్పటికే ఆ చిన్నకారులోంచి దిగిన ఒక యువతి, యువకుడు మధు ప్రక్కగా నిలబడి కంగారుగా వున్నారు. యేమిటో చూస్తున్నారు.

"అలా చూస్తే యేం లాభం...ఆస్పత్రికి పట్టుకెళ్లక" అన్నాడొక పెద్దమనిషి యింతలో.

"నెంబరు నోట్ చేసుకోక వదిలిపెడతావేరా!" అంటున్నాడొక యువకుడు ప్రక్క వాడితో.

"కళ్లు పోయినయ్యా! నాయనా! చూసి తోల్లేవు" అన్నగొక ముసలి గవ్వలాంటి అవ్వ.

"యెందుకు నాయనా! అలా అనుకొంటారు... డ్రైవరు తప్పేముంది ... ఇంకా నయం జాగ్రత్తగా ఆపగల్గాడు"...అందా యువతి.

యువకుడు మధువంక చూస్తూ—ఒక నిట్టూర్పు విడిచాడు.

"యెలా వున్నాడు?" అందాయువతి, యువకుని వైపు చూస్తూ.

"ఫర్వాలేదు...కొద్దిగా గాయాలు తగిలినయి" అన్నాడా యువకుడు.

"ఇంటికి తీసికెళ్ళితే"—

"అలాగే..."అంటూ యువకుడు ముందుకొచ్చాడు- యువతి అతని దగ్గరగా వస్తూ—

"డాక్టర్ ... తప్పకుండా బ్రతుకుతాడా!" అంది జాలిగా—

"నువ్వేం ఆదుర్దాపడకు! నేనున్నానుగా!" అంటూ ఆమెను ఓదార్చాడు.

ప్రక్కనవున్నవాళ్ల సహాయంతో మధుని కార్లో కెక్కించుకొని యింటికి తీసుకొచ్చింది ఆయువతి.

2

డాక్టర్ రఘు మర్నాడుదయమే వచ్చి, గుడ్డలు మార్పించి, కట్లు గట్టాడు.

క్రమంగా అతని మొగంలో స్పృహాఛాయలు కనిపిస్తున్నాయి. బాధకు ఒళ్లంతా కదలిపోతోంది. మూలుగుతూ — ముక్కుతూ — కళ్లు తెరుస్తూ, మూస్తూ ఉంటున్నాడు.

సరోజని మధు ప్రక్కనే కూర్చొని, అతన్ని అవలోకిస్తూ ఉంది—

రఘు చేతులు కడుక్కొని, తుడుచుకుంటూండగా-

"ఇంజక్షన్ ఇచ్చారా! ఈపూట స్పృహ వస్తుందా!" అన్నది సరోజని.

రఘు ఆమె కళ్లల్లోకి చూస్తూ—

మరేం భయంలేదు సరోజనీ, నేనున్నానుగా! ప్రమాద మేమీ లేదు. మళ్లీ రేపొస్తాను. అంతగా కావాలంటే నర్సునిసహాయంపంపమంటావా!" అన్నాడు.

"అంతగా మరేం అవసరంలేదు. నేనిక్కడే వుంటాగా—" అంది సరోజని.

రఘుకి జాలివేసింది—

"క్రిందటి రాత్రి కూడా నువ్వు నిద్రపోకుండా మేల్కొన్నావ్. ఈ పూటకూడా అలావుంటే నీ ఆరోగ్యం యేమౌతుందో తెలుసా!" అన్నాడు.

"ఫర్వాలేదులే రఘూ! ఒక ప్రాణికోసం ఈ మాత్రం ఉండలేకపోతే యెలా!" రఘు దీర్ఘంగా ఆలోచించాడు. ఏం చెప్పలేకపోయాడు - చివరకు లేచి వెళుతూ-"నీయిష్టం రోగి లేచినప్పుడల్లా యేం కావాలంటే అది, అంటే పళ్ళు, రొట్టె, పాలు యిస్తూండు — చెప్పాగా మందు యెప్పుడెప్పుడివ్వాలో. మరి యిక వెళ్లనా!" అంటూ సరోజనిని తృప్తిగా చూసి మందుల సంచితో రఘు మెట్లుదిగి వెళ్ళిపోయాడు.

మధుకి, రఘు వెళ్ళిన గంటకు తెలివి వచ్చింది. అక్కడక్కడా తగిలిన దెబ్బలవల్ల బాధ తెలుస్తూనే ఉంది. అదే చావాలనుకోడం అనుకొన్నాడు మధు. 'చావు', ముందు అలా ప్రారంభమవుతుందనుకొన్నాడు.

పూర్తిగా చావకముందే ఒక్కసారి ఆ చావెలా వుంటుందో బాగా కళ్లు తెరచివుంచి చూద్దామనుకొన్నాడు. కాని భయం కాని భయంయేదో వీపుమీద తట్టుతోంది.

"ఇంత బాధపడే ముందుగా, ప్రాణం యెందుకు ఎగిరిపోకుండా వుంది?"—మధుకి యీ సందేహం తట్టింది. ప్రాణం పోవడం ఒకసారి, బాధను అనుభవించడం మరొకసారి అయినట్లయితే తనీ విధంగా చావుని కోరుకొనేవాడు గాదేమో! అనుకొన్నాడు మధు. అసలు మధు కిప్పుడు బ్రతకటంకంటే కూడా చావడమే కష్టమనిపించింది.

స్పృహవచ్చి, తనెక్కడ వున్నాడో తెలియని అధోగతిలో వున్న ఆత్మను యేవో శక్తులు ఈ చావుకి పురిగొల్పాయి. భరించలేని యమబాధ దానికితోడు అదే పనిగా కళ్లు తెరచి అటూ-యిటూ పొత్తిగిల్లకుండా బల్లపరుపుగా పడుకొని వుండటం చావుకన్నా కష్టమనిపించింది మధుకి.

ఇంతలో ఎదురుగుండా వున్న గడియారం రెండు గంటలు కొట్టింది.

మధుకి యీ లోకంలో పడ్డట్టనిపించింది. కట్లు కట్టబడిన చేతి వ్రేళ్లతో కళ్లు నులుముకొన్నాడు. రకరకాల వస్తువులతో అలంకరించబడిన పెద్ద గది రివ్వున తిరిగే 'ఉషా' పంకాలూ — గోడకు పెద్దపెద్ద ఫోటోలు—రెండు నిలువుటద్దాలు—ఒక పుస్తకాల బీరువా—ఒక డ్రాయరు—దాని చుట్టూ రెండూ—మూడు కుర్చీలూ—దాని ప్రక్కగా ఒక రేడియో సెట్టు—ఇవన్నీ మధుకి స్వర్గాన్ని గుర్తు చేసాయి. ఇలాగే వుంటుందని మధుకి గుర్తు కూడా. ఇంతలో కాలు వెళ్ళి గోడకు తగిలి, నరక బాధను జ్ఞప్తికి తీసుకొచ్చింది.

మధు మామూలు మనిషి అయినాడు—ఈ స్వప్నంలో స్వర్గాన్ని చూసి కలవరించిన తరువాత మళ్లీ బాధ మధుని పీడించడం మొదలెట్టింది. సన్నగా మూల్గక తప్పడం లేదు—కళ్లు మూసే మధు తనకితాను తిట్టుకొంటూండగానే—సరోజని చల్లని చేయి, అతని బుగ్గల్ని స్పృశించుతూ నుదుటి మీదకు వెళ్లింది—.

చనిపోయిన తల్లి గుర్తుకొచ్చింది—

మధు బరువుగా కళ్లు తెరచాడు.

సరోజని అమృతాన్ని గురిపిస్తూ తన వైపే చూస్తోంది. దేవకన్య కన్నా విపరీతమైన సౌందర్యంతోనూ, అమ్మ తరువాత అమ్మకన్నా యెక్కువగా చూసుకొనే వ్యక్తిగానూ, సరోజని మధుకి కనిపించింది.

ఒక్క క్షణం కన్నా యెక్కువసేపు సరోజనిని చూడలేకపోయాడు.

"బాధపుడుతోందా!" అంది కోమలంగా సరోజని.

"ఊఁ" అంటూ మూల్గాడు బాధనంతా వ్యక్తం చేస్తూ. సరోజనిచేయి ఫాలభాగం మీదనుంచి జారిపోతూండగా—మధుకి అందిన హాయి యేదో హఠాత్తుగా పోతోందనిపించింది." ఇంకా కాసేపు అలాగే వుంచమని" ప్రాథేయపడదామనుకొన్నాడు మధు. కాని యెట్లా అంటాడు. ఆమె అతని మొగం మీదకు తన మొగాన్ని దగ్గరగా వుంచుతూ—

"కాస్త కాఫీ యివ్వనా!" అంది—

మధు మాతృహృదయంలోకి చొచ్చుకొని పోయినట్లుగా భావించాడు.

ఆకలి జ్ఞాపకానికి వచ్చింది. క్రిందటి రోజున ఉపవాసం—యీనాడు......!"

"అబ్బా!" అన్నాడు మధు.

ఆమె లేచి విచారంగా అతన్ని చూసింది. అతను తన బాధను, నెమరు వేసుకొంటున్నాడేమో నని సంశయపడ్డది... కాని అలాగే సరోజని యెక్కువ సేపు నిల్చోలేదు.

ఆమె గాజుల చప్పుడు యెప్పుడైతే అక్కడనుంచి మటుమాయమైందో—మధుకి పూర్వపు ఆలోచనలు కదలినయి.

"తాను చదువుకొంటున్న రోజుల్లోనూ—ఉద్యోగం చేస్తున్న రోజుల్లోనూ, ఎంతోమంది అందమైన ఆడ వాళ్ళను చూడగలిగాడు. వాళ్ళందరి అందం—ఆనందం, సరిగ్గా ప్రపంచంలో వినియోగించుకో బడిందా! యెన్ని విపరీత పరిణామాలకు దోహదం కాలేదూ!—తన విషయంలో మాత్రమే సఫలమైంది. చావుని కోరి బయలుదేరిన నాకు, స్వర్గ సౌఖ్యాల్ని అనుభవించే భాగ్యం లభ్యమవటమేమిటీ! నేను పడిన కోరుకి, చంపడం చేత కాదేమో! ఎన్నిసారు తన నిరాశను చంపుకొన్నాడు. హృదయంలో వుండే క్షోభను యెన్నివందలసార్లు అణచుకొన్నాడు! అయినా బ్రతికి సాధించగల్గేదేమిటి? చివరకు మళ్లీ కంపలోకి కూడా పోలేని అసమర్థత తనలో పుట్టుతుందేమో! యెలాగైనా బ్రతకాలని కోరకూడదు. ఈ మొండి ప్రాణికి సానూభూతి - జాలి - దయ - మాప కూడదు. ఈ సారికి యీ బాధను పెంచుకొన్నానా. శాశ్వతంగా కావాలనుకొనే చావు సంప్రాప్తమవుతుంది. ఎవరితోనూ, ఏ విధంగానూ సంబంధం పెట్టుకోకూడదు. బ్రతకడానికి ఆశించే విషయాల వైపుకి మనస్సుని పోనివ్వకూడదు. చావుకి ముందు, తనమీద యెందుకీ సానుభూతి యీ అందగత్తెకు? అసలీమె యెవరు? తన 'ప్రాణానికి యెందుకిలా సేవలు చేస్తోంది నేను చావాలనుకొంటే, నన్ను ఆపి యేవో పనులు చేస్తోంది—చివరకు సుఖంగా చావనీయరు—ఏడ్వనీరు—అయినా, నాతో యీమెకేం పని. ఇలా నాదగ్గర కెందుకొస్తోంది?—తనకేంపని... సరోజనిదగ్గరగా వచ్చి కూర్చుంటూ.

"కాఫీ కలిపి తెచ్చాను. త్రాగుతావా!" అంటూ బుజ్జగిస్తూ అడిగింది.

"అక్కర్లేదన్నట్లు తలూపాడు.

"ఫర్వాలేదు త్రాగండి. లేకపోతే శోషొస్తుంది!" అంది. నుదురు తుడుచుతూ—

మూల్గుతూ "నాకొద్దు" అన్నట్టు తలూపాడు. మనస్సులో యేవోభావాలు నిద్రకొస్తున్నాయి. "తాను చూపే సానుభూతికి, యితనేమీ బాధ్యుడు కానట్లుగా ఉంటాడేమిటీ!" అని ఆశ్చర్యపడుతుందేమోనని మధు ఈనాటి నాగరికతా లోకాన్ని తడిమి చూశాడు. ఆమె అల్లాగే తన కళ్లల్లోకి, కళ్లు పెట్టి చూస్తోంది. ఏవో భావాలు రంగరించి, యేదో మను తను గుర్తుచేస్తూ, తన బాధకు ఉపశమనం కలిగించే సానుభూతిని, సందేశాన్ని తన చూపులద్వారా అంద చేస్తోంది. మధు ఆచూపుల్లో గల అంతరార్థనివహాన్ని గ్రహించుకోలేక, కంటనీరెట్టుకొన్నాడు.

సరోజనికి హృదయం ద్రవించింది మృదువుగా అతని తలనిమురుతూ — "ఊరికే బాధపడకు. అదే తగ్గిపోతుంది. కాస్త కాఫీ త్రాగండి" అని బ్రతిమిలాడినట్లు మాట్లాడింది.

"అబ్బ! నన్ను యిట్లా ఉండనీయండి. ఊరికే చంప బోకండి. నన్ను యెలాగోలాగు యేడ్చుకోనీయండి

"మీరు యిక్కణ్ణుంచి అవతలికి వెళ్ళిపోండి! యీగల్లాగా పీక్కుతినకండి! నా యెముకలు కొరకకండి! ఎట్లాగోట్లా ఛస్తాగా" అంటూ మధు రొప్పుతూ — నుదురుమీద చెయ్యి పెట్టుకొని, గుండెను యెగురవేస్తున్నాడు

సరోజనికి మతిచలించినట్లయింది—అర్థంకాని భయమేదో ఆమెను వరించింది. మందుసీసాలోని మందు నిజమైన మందేనా! అంతా అయోమయంగా తోచింది. రోగికి మతి చలించలేదుగదా! ఏమో! సరోజనికి అనుమానం వేసింది. కాసేపు అలాగే పలకరిస్తాడనే ఆశతో నిలబడే ఉండగల్గింది. మధు యేం మాట్లాడ్డంలేదు. సరోజని అతన్ని విసిగించకూడదనుకొంది. చేతిలో కప్పుని అలాగే ప్రక్క బల్లమీద వుంచుతూ - వెనక్కి తిరిగింది. సరోజని వెళ్ళిపోయిన అరగంటలోపే మధు కళ్లు తెరచిచూశాడు. ఆమె లేదు. టేబిల్ మీద కాఫీకప్పువుంది. మంచి వాసన కూడా వేస్తోంది. త్రాగాలని జిహ్వకోరింది. మధుకి చావాలనివుంది. త్రాగితే చావు వాయిదాపడుతుంది. ఎందుకు వాయిదా పడేసుకోవాలి. చచ్చిపోవాలని నిశ్చయించుకొన్నవాడు, బ్రతికించే వస్తువుల్ని అసరాగా కోరకూడదనిపించింది ఎదురుగా వుంటే యీ కోరిక బలిసిపోతుందనుకొని మధు ఆ కప్పుని బల్లమీద నుంచి తోసిపారవేశాడు.

గది వెలుపల గోడప్రక్కగా నిలబడివున్న సరోజనికి యీ శబ్దం వినిపించింది. నిశ్చేష్టురాలైపోయింది. స్పృహ తెలిసివుండీ యిలా ప్రవర్తిస్తున్నాడని సరోజని గ్రహించింది. ఎందుకింతకోపం? ఆమె కర్థంకాలేదు. తెలుసుకొంటానికి అవకాశం కల్గటం కష్టం యిప్పుడు! నెమ్మదిగా మధు దగ్గరకొచ్చి నిలుచుంది. అతను కోపంగా పగిలిన పింగాణీ పెంకులవంక చూస్తూ

న్నాడు. సరోజని మాట్లాడించాలని ప్రయత్నించి—,

"మందివ్వమంటారా! వేళయిందికూడా!" అంది.

మొగం చిట్లించి, పరీక్షగా చూశాడు సరోజనివంక.

తనతో చదువుకొన్నవాళ్ళల్లో ఒకమ్మాయి యిలాగే వుండేది అచ్చంగా.

ఆ అమ్మాయేనా యీ అమ్మాయి—

ఏమో!

అంతగా యీ ఆలోచననుగురించి బాధపడ తల్చుకో లేదు మధు. ఏదైనా—ఒకప్పుడు పరిచయ ముంటే దాన్ని జ్ఞాపకం తెచ్చుకోటంకూడా యీ సందర్భంలో అనవసరమనిపించింది.

మధు పరీక్షగాచూసి, తలతిప్పుకోవటంలో, సరోజని అతని భావాన్ని కించిత్ గ్రహించినదానిలాగా—

కుర్చీలో కూర్చొని—

"గుర్తుకొచ్చానా! లేదా!" అంది.

మధు మూగవాడిలాగా వూరుకొన్నాడు. బాధగా కళ్ళు మూసుకొన్నాడు.

మధు యీసారికూడా యేం జవాబివ్వకుండా వూరికే వున్నాడు.

ఆమె సాహసించి మందు గ్లాసులోపోసింది. అతను ఆమె భుజాన్ని అసరాగా చేసుకొని లేచాడు. పెదవులు విప్పి తాగుదామనుకొన్నాడు. కాని "చచ్చేవాడికి మందులేమిటి" అనిపించింది. తన దౌర్భాగ్యానికి తానే నవ్వుకొన్నాడు.

అంతలోనే ఆ మందుమీద కచ్చి పుట్టుకొచ్చింది. ఆమె చేతిలోంచి మందుగ్లాసు లాక్కొని బలవంతంగా గోడకు విసరికొట్టాడు.

ఆమె విశాల నేత్రాలు ఆశ్చర్యపడ్డాయి.

అతని వికృతాకారం సరోజనికి భయాన్ని కలిగించింది. కాసేపటికి తెప్పరిల్లి—

"ఏమండీ!" అంది మెల్లగా—

ఏమూలనో దాగివున్న నిరర్థకమైన దుఃఖం అతని గొంతుకలోంచి బయటికి కొస్త కొస్త రాసాగింది.

అతని మనస్తత్వాన్ని ఆమె గ్రహించాలనుకొని చాలా ప్రయత్నించింది. చివరకు యేం తోచలేదు. యెక్కువసేపు అలా కూర్చోవాలనిపించలేదు. మెల్లిగా లేచి గది యివతలికి వచ్చేసి కూర్చుని ప్రకృతిలోకి చూడటం మొదలెట్టింది — మధ్యమధ్య మూల్గులు— గొణుగుడు మాటలు ఆమె నిశ్చలాలోచనల్ని భంగపరుస్తున్నాయి.

అప్పటికి నాలుగు గంటలు దాటింది. మధు మూల్గటం లేదు.

సరోజని దగ్గరకు వేసిన తలుపుల్ని కొద్దిగా తెరచి చూసింది

నిద్ర పోతున్నట్లుగా వున్నాడు—

ఆమెకు కూడా శ్రమ యేదో కాసేపు నిద్ర పొమ్మని సెలవిచ్చింది—

అలాగే యిద్దరూ ఆ సాయంత్రం పూట చిన్నకునుకు తీసారు

3

చీకటి పడింది.

మధు నిద్రపోతూనే వున్నాడు.

సరోజని కళ్లు నులుముకొని, లేచి కూర్చుంది.

జరిగిన సంఘటనంతా గుర్తుకు రాసాగింది.

సరోజనికి మధుపట్ల యెలా సానుభూతిని, జాలినీ చూపించాలో తెలియలేదు.

ఒక్కసారి మధునిచూసి నిర్వేదించింది.

ఇంతలో బూట్లచప్పుడు ఆమెని కదిలించాయి.

రఘువచ్చాడు.

సరోజని లేచి నిలబడింది.

"ఎలా వున్నాడు?" అని అడిగాడు రఘు.

సరోజని రఘుని యివతలికి పిల్చి, మధు చేసిన తతంగమంతా పూసగుచ్చినట్లు చెప్పింది. అతనుపిచ్చిగా నవ్వాడు

సరోజనికి ఆ నవ్వు వింతగా తోచింది.

"నేచెప్తే విన్నావ్! నీలాంటివాళ్లకు రోగుల పట్ల ఎలా వుండాలో యేం తెలుస్తుంది. ఈశ్రమ నీవు పడలేవ నే నర్సుని పంపుతానంది విన్నావ్ కావు. రోగుల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవటమంటే, కూరగాయలు తరగట మనుకొన్నావా!

"అతను చివరకు మందూ—తాగలేదు కాఫీ కూడా రుచి చూడలేదు—విసిరిబుచ్చుకొని పారవేశాడు"—అంది నిర్జీవంగా సరోజని.

"అదంతా నే చూసుకొంటాగాని, నువ్వేం బెంగ పెట్టుకోకు. అసలిదంతా ఒక విద్య. ఇంకా నువ్విది చదువుకోవాలి." అంటూ రఘు మధువంక చూసాడు. అతడు యీ సందర్భంలో మేల్కొవటానికి కారణం వాళ్ళిద్దరి మాటల సందడే.

మేల్కొని మూలుగుతున్నాడు. మధ్యమధ్య ఊపిరి సలపకుండా యెక్కిళ్లు వొస్తున్నయి.

రఘు మధు దగ్గరకు చేరి అతని మొగాన్ని తనవైపుకు త్రిప్పుకొన్నాడు-మందు యివ్వబోతున్నాడు మధుకి ఆశ్చర్యాన్ని కలిగించింది — ముఖంలో ఆ ఛాయలు ద్విగుణీకృత మయినాయి.

"మళ్ళీ వచ్చారు. నా ప్రాణానికి యమభటుల్లాగా— సిగ్గులేదురా? వద్దంటే ఎందుకొస్తారు! చంపాలనుకొంటే ఒక్కసారి చంపరాదు! యెందుకిట్లా కొస్త కొస్తగా యేడిపిస్తూ, చంపుతారు!" అని మధు, రఘుని విదిల్చిపారేశాడు. రఘు ఒక క్షణం ఆలోచించాడు.

"దేనికింత శ్రమపడుతారు. త్వరగానే తగ్గిపోతుందిగా కొస్త మందు త్రాగండి! యేం గాబరాపడకండి!"—

"నాకు బ్రతకాలని ఆశలేదు. మీరు నన్ను అర్థంచేసుకోలేక పోతున్నారు. నాకు మీరేం ఉపకారం చేయక్కర్లేదు. చేయదల్చుకుంటే, త్వరగా చచ్చే ఉపాయం చెప్పండి — చావడానికి యే మందిచ్చినా హాయిగా తాగుతా!"

సరోజిని, రఘు గొంతుకలు ఆ మాటలు విన్న తరువాత మూగపోయినవి. నిరాశ పెరిగినా, జీవితానికి ఆశ నశించదు ఒక ప్రక్క ప్రాణంపోతూ వున్నా, బ్రతకాలనే ఆకాంక్ష అనుకున్నంత తేలిగ్గా మాసిపోదు. "చావాలి — చావాలి" అనుకొన్నప్పటికీ, ఆ కొస్త క్షణం వచ్చేటప్పటికి బ్రతికి యేదో సాధించాలని బుద్ధి పుడుతుంది. అది జీవికి లక్షణం. కాని యితని ప్రవృత్తిలో చాలావరకు ఆసూచనలు యెక్కువగా కనిపించడం లేదు. వికృతమైన మనస్తత్వం దాని పరిణామంలో గల అంతరార్థం రఘుకి బోధపడటం లేదు.

రఘు తరువాత చాలాసేపు బ్రతిమిలాడాడు.

"పాపం చాలా కష్టాలు పడినట్టున్నారు. అందుకనే జీవితం అంటే విసుగుపుట్టింది. నిరాశను బలపర్చుకొన్నారు—" అన్నాడు రఘు మధువంక చూస్తూ.

"అవును. ఏం......తప్పా!" మధు గంభీరంగా అన్నాడు.

"ప్రస్తుతం మీ కటువంటిదేం వుండకూడదు...మీ ప్రాణానికి యేం ఫర్వాలేదు. తప్పకుండా యీ వ్యాధి నయమవుతుంది—మీ రిలా అనుకొంటూ వుంటుంటే యెలా నయమవుతుంది!"

"నా కసలు బ్రతకాలని లేదు. తెలుసునా!"—రఘు యేం మాట్లాడలేను.

"నాకు తెలుసు. చావు అనుకున్నంత తేలిక కాదని"- అందుకే దానికోసం మందివ్వమంటున్నా!"

ముందు పంటితో క్రింద పెదవి కరచుకుంటూ రఘు యేమో ఆలోచిస్తూన్నాడు.

సరోజని నిశ్చల నిరీహ నేత్రాలతో మధుని చూస్తోంది. రఘు సరోజని వంక తర్వాత నెమ్మదిగా చూస్తూ "సరోజా! నాకేం తోచటంలేను. ఇతని మతిభ్రమణం చూస్తుంటే, ముందు నాకు మతిపోయేటట్లు వుంది"— అన్నాడు.

సరోజని అతన్ని గదినించి అవతలికి తీసికెళ్ళి కూర్చోపెట్టింది.

అతను ఒక సిగరెట్ తీసి కాలుస్తూ—ఆమె కళ్లల్లోకి చూసాడు.

సరోజిని మృదువుగా - అంది:

"అతనికి స్పృహవుండే యిలా అంటున్నాడు. ఇంత మొండిగావుంటే మీ రెలాగూ మందివ్వలేరు. అమృతం యిచ్చినా, హాలాహల మవుతుంది శారీరకంగా కుదర్చడం చాలాకష్టం. అందుకని మానసికంగా ముందు ప్రయత్నిస్తే యీ నిర్భాగ్యుడు యేమైనా లొంగచ్చు.."

రఘు సావధానంగా విని—

"అయినా నీ కెందుకొచ్చిన బెడద. నువ్వు వొప్పుకొంటే యీ పాళాన తీసికెళ్లి ఆ జనరల్ ఆస్పత్రిలో పారేస్తే నీపీడా, నపీడా పోతుందా" అన్నాడు విసుగ్గా. ఆమాట వినంగానే సరోజనికి కళ్ళల్లో నీళ్లు తిరిగినయి.

రఘుకి విస్మయం కలిగింది.

"సరోజా! యేమిటది?"

"ఏముంది, యింతా చేసి అతనికి ద్రోహం చెయ్యటం కన్న యేమైనా ఉందా!" ఎండుకుపోతున్న గొంతుక లోనుంచి వినబడే మాటల్లాగ వున్నయి అవి రఘుకి.

"అతను వాస్తవంగా నిర్భాగ్యుడే. అతన్ని చూసినప్పుడే నాకు యింతజాలి ఎందుకుకల్గిందో తెలియదు. పైగా నాతో చదువుకున్న వాడు. చాలా బీదవాడు కూడా. అతని జీవితం యెటువంటిదో నాకు బాగా తెలుసు. వారాలు చేసుకొని కొన్నాళ్లు చదివాడు. జీతాలు కట్టుకోలేని స్థితిలో నేనే చాలా సార్లు సాయపడ్డాను. జీవితంలో మనం యెవ్వరమూ యెరుగని

కష్టాల్ని నష్టాల్ని చవిచూచాడు. సరిగ్గా యీ నాడు మన కారు క్రింద పడే ప్రాణాలు తీసుకొంటూనికి ప్రయత్నించాడు. యేదేమైనా, నా యింట్లో, నా కళ్ల ముందు నిష్కారణంగా అతని ప్రాణాలు పోవడం యిష్టం లేదు. ఎంత ఖర్చయినా, భరాయిస్తాను. అతని ప్రాణం నిలబెడతాను. యెలాగైనా అతను బ్రతికే ఉపాయం చూడండీ!" అంటూ సరోజని తన బాధను—ఆదుర్దానూ— మమకారాన్నీ - స్నేహాన్నీ వ్యక్తపరిచింది. రఘు ఆమె ఉద్దేశ్యం తెలుసుకొని ఆశ్చర్యపడ్డాడు. సరోజను ప్రేమిస్తూ, పెళ్లి చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు రఘు. ఈ ప్రయత్నం యిప్పటికి సంవత్సరంబట్టీ ఉధృతంగా జరుగుతోంది. ఆమె అంగీకారం కోసం తాను పడేపాట్లు యింతా అంతా గాదు. ఎలాగైనా సరోజను సంతోషపెట్టి, తన అనురాగాన్ని ఆమె హృదయంలో పాతుకొని పోయేటట్లు చేయాలని భగీరథప్రయత్నాలు జరుపుతున్నాడు.

ఇప్పుడు యీ రోగి విషయంలో అతను తగినంత శ్రద్ధ చూపాలనుకొన్నాడు, సరోజనికోసం. యీ సరోజనే తనకు తటస్థపడక పోయినట్లయితే యీ రోగి - అందరి రోగుల్లాంటిరోగే - క్రొత్తదనమేమీ యీతనిలో రఘుకి కన్పించలేదు. సరోజనికి గల శ్రద్ధ, పట్టుదల రఘుని ఉన్మత్తి పరచినయి.

రఘు చాలా సేపు సరోజని చెప్పిన విషయాలను గురించి తలపోశాడు - ఆలోచించాడు.

తర్వాత మెల్లిగా అన్నాడు.

"సరే...నువ్వంతగా కోరుతుంటే నే కాదనలేను. నాకు మాత్రం మానవులంటే దయ — జాలీ— లేకపోలేదు. అందులో యితను బీదవాడు — తెలివిగలవాడు—చదువుకొన్నాడు. అన్నిటికన్నా ముఖ్యమైంది నీకిష్టమైనవాడు. అందుకని నా శాయశక్తులా ప్రయత్నించి యితన్ని బ్రతికిస్తా. దానికి ఒక్కటే ఉపాయంవుంది — అయితే అది చాలా కష్టమైంది" రఘు సరోజని వంక చూసాడు యీమాటని.

"అయితే అయింది. ఏమిటది?" అంది తేలిగ్గా.

"అతనికున్న 'నిరాశ' 'విసుగు' 'నా' అనేవాళ్లు లేకపోబట్టే యింతగా పెరిగినయి. అతనికిప్పుడు 'నా' అనేవాళ్లు కావాలి. మనస్సులో మనసై మెలగాలి, అతనికిగల అభిరుచుల్ని గ్రహించగలగాలి. సరిగ్గా అలా నటించాలి—మరి నువ్వు యివన్నీ చేయగలవా!" అన్నాడు రఘు—

సరోజనికి "యేం చెయ్యాలో తోచలా"—

"ప్రేమిస్తున్నట్లుగా నటించు — లాలిస్తున్నట్లుగా మాట్లాడు — అతన్ని నీ ప్రియుడిగా భావించు — ఆభావాన్ని అతను గ్రహించుకో గల్గాలి — నువ్వు ఆత్మబంధువుగా అతనికి కనబడాలి — ఎంతో ఓర్పు చూపాలి — అతనేమన్నా నువ్వు పడాలి — చాలా ప్రసన్నవదనంతో అతనికి కనబడుతూండాలి — నీ మీదే అతని జీవితాశయాన్ని వుంచుకొనేటట్లుగా ప్రవర్తించాలి— లేనిపోని ఆశలు అతనికి చూపెట్టు. స్త్రీకి లొంగని పురుషులెవరు చెప్పు! అందులో నీలాంటి అందకత్తెకు సాధ్యంకాని పనేముంది? ఇది తేలిగ్గా చేయగల్గితే అతను బాగుపడతాడు. మానసికంగా యింతకన్నా చేయగల్గిందేం లేదు"—అన్నాడు రఘు. సరోజకు యివన్నీ త్వరగా అర్థం కాలేదు. చాలా సేపటివరకు ఆలోచనలు విడిపోలేదు. చివరకు ఎలాగో ఒక నిట్టూర్పువిడిచి—"జీవితంలో నాటకమాడాలన్న మాట"—అంది.

"అవునుమరి. కాకపోతే యితను నువ్వనుకొన్న వాడు కాకుండా పోతాడు తెలుసా!" అన్నాడురఘు.

"ఇది సాధ్యమవుతుందా!"—అంది సరోజని సందేహంగా—

"ఏదికాదు సరోజా! నిత్యమూ మనజీవితంలో మనకు తెలియకుండా యీవిధంగా జరిగిపోవడంలా. అనుకొంటే యీ తేడా కనిపిస్తుంది. యిష్టంలేక తిట్టుకున్నప్పటికీ—ఆ వ్యక్తి కనపడితే — అనుకొన్నదంతా గుండెల్లో దాచుకొని, పైకి మామూలుగా మాట్లాడుకోవటం లేదూ! జీవితమంటే నానిర్వచనం ఒక్కటే! 'నటన' అని"—

"నటన"—సరోజకు తనజీవితం జ్ఞాపకం వచ్చింది. ఏదో క్రొత్తవిషయం. నేర్చుకోవాలి కలలోచూడండీ, తలవందీ ఈ విషయం.

రఘు మాటల్ని బాగా అర్థం చేసుకొంది. దొంగనటన, మధుపట్ల చేయడానికి నిశ్చయురాలైంది. తను చేస్తున్నది తప్పయినా, మధుపట్ల చేయకతప్పదు. అతను ఆరోగ్యవంతుడు కావాలి. లేకపోతే తన ఆత్మకు శాంతిలేదు. పెద్దవాళ్ళకన్నా చిన్నవాళ్లు యీ విషయాల్లో చాలా తేలిగ్గా చేసివేస్తారు. ఎందుకంటే వాళ్లకిన్ని ఆలోచనలు వుండవు. అసలుకలగవు.

"ఏమంటావ్ ?" అన్నాడు రఘు గట్టిగా—

"చూస్తూ చూస్తూ చేయక తప్పుతుందా !" అంది.

"ఔను మరి. కాకపోతే యెలా అతను బాగుపడతాడు, నువ్వు చెయ్యబోయే పనికి నర్సుకూడా అక్కర్లేదు నీ హృదయం అతనికి అర్పించే స్థితిలో వుండాలి. అతని అభిరుచులకి నువ్వే బాధ్యురాలివి. అతనిదృష్టిలో నువ్వు 'ప్రేయసి'వై - నీ దృష్టిలో అతను ప్రియుడై వుండగల్గితే, అతను నీవాడు. నీవు చెయ్యగల్గింది అతడురాలా అవుతుంది. తరువాత పనంతా నే చూసుకొంటూ మరి వెళ్ళిరానా !" అంటూ రఘూ వెళ్ళిపోయాడు.

అతను వెళ్లిన దిశవంక చూస్తూ - సరోజని చాలాసేపు యేవో ఆలోచించింది - అతను అన్న మాటల్లో సత్యం యేదో వుందని ఊహించింది. తనకి పట్టివున్న బాధ్యతను తానే కోరకురాలనుకొంది - ఒక్కసారి తలుపు తీసి మధువంక చూసి చిన్నగా నవ్వింది.

4

ప్రస్తుతం యేంచేయాలి ?

సరోజకు తట్టింది. చేస్తే యెలా చేయాలి.

అందులో నటన. అనుకొన్నంత తేలిగ్గాదు తాను ఒకర్ని ప్రేమించాలి ఇంతకు ముందెప్పుడూ యెవర్నీ ప్రేమించలేదు. తనని ప్రేమించాలనే చాలామంది కుర్రాళ్లు చదువుకొనే రోజుల్లో ప్రయత్నించి వ్యర్థులైనారు. ఎన్నోసార్లు ప్రణయగాథలు చదివిందే గాని, ప్రణయాన్ని యెవ్వరిపట్ల యింతవరకు ప్రదర్శించే యోగం పట్టలేదు. కాని యీనాడది అవసరమైంది. యెవరికోసమో గాదు తనకోసమే— సరోజకు కొంచెం ధైర్యంవచ్చింది.

రఘు విషయం సింహావలోకనం చేసుకొంది. అతను తనతో స్నేహాన్ని పెంచుకొని, చివరకు ప్రేమికునిలా మారిపోయి పెళ్లి చేసుకొందామనే వుద్దేశ్యంలో వున్నాడు. కాని తాను ప్రేమించలేదే అంతెయినిగా- ప్రేయసిలాగా ప్రవర్తించడం అంటే దానికి సహజత్వం కొంతయినా వుండాలి.

సరోజని ఉద్దేశ్యం రఘుకి యేమాత్రం తెలియదు. చదువుకొన్న రోజుల్లో తనంటే కాలేజీ కుర్రాళ్లు పడే తహతహను తల్చుకొంది. ఎందుకలా అవగలిగారా అనిపించింది. లోకం పోకడ ఆలోచించినకొద్దీ సరోజకు బాగా అర్థమవుతూ వచ్చింది.

ప్రేమించి వున్నట్లయితే, అంత బాధనిపించేదిగాదు. ప్రత్యేకంగా ప్రేమించా లనుకొంటే అది సవ్యంగా జరగటం చాలాకష్టం.

"మధుకి- తనకి యేమిటీ సంబంధం- ఏమైనా తప్పుడా ! బంధువా ! కేవలం స్నేహితుడు. కాకపోతే తనతో చదువుకొన్న బీదవాడు—తెలివిగలవాడు. ఇంతగా శ్రమ అతనిపట్ల యెందుకు తీసుకోవాలి" ఊరుకుంటే బాగుండేదికాదా! సరోజని గుండె యీమాట అనుకోగానే ద్రవించింది నీరులాగా !

ఇంతదయ - జాలీ - సహాయం చేయకుండా, చూపకుండా వున్నటయితే అతనీపాటికి యెక్కడుండేవాడో! అతగాడే, అంతగా బతికి కేసు పెట్టించినట్లయితే వెయ్యి రూపాయిలతో వాడిని సంతృప్తి పరచి, నాదారిన నేను వచ్చేదాన్ని. కాని అంత నీచురాల్నని యెలా అనిపించుకోను. మందూ, మాకు లేకుండా, మాని పోయే రోగానికి సరియైన ఔషధం తనే వుండగా, వేరొక ఆస్పత్రికి యెందుకు తీసికొని వెళ్లాలి.

మానవుడికోసం తోటిమానవుడు ప్రాణాలు సైతం ధారపోస్తున్న యీనాటి నాగరికలోకంలో ఒక్క ప్రాణిని, తనతో చదువుకొన్న వాణ్ణి, సౌమ్యుణ్ణి, నిర్భాగ్యుణ్ణి, తనకున్న డబ్బుతో తనకు చేతనైన సహాయంతో అతన్ని బ్రతికించలేకపోతే యెందుకనిపించింది సరోజకు. ఒక జీవికోసం తన జీవితం త్యాగం చేస్తుండటం తప్పా! ఇంత పేరు ప్రఖ్యాతులు గడించుకొన్న భారతదేశంలో ఒక్క అల్ప ప్రాణం నిష్కారణంగా అరిపోతూంటే, తనలాంటి శ్రీమంతుల బిడ్డ చూస్తూ వూరుకోవడం తగనిపని" అని నిశ్చయించుకొంది సరోజ.

కేవలం అతని ప్రాణాల్ని నిలబెట్టటం కోసం - అతని బ్రతుకు ఫలించడం కోసం. ప్రపంచంలో తానుకూడా ఒక మనిషిననిపించుకోడానికికోసం తానేంచేస్తే మాత్రం తప్పేముంది? తను చేయబోయే పని తనకు అన్నివిధాలా మంచిదనిపించింది. హృదయం ఉప్పొంగిపోయింది. కళ్లల్లో నవ్యకాంతులేవో తిరుగాడుతున్నట్లుగా తోచాయి. ప్రతి అవయవంలోనూ ఉత్సాహం, ఆనందం ఉరకలువేస్తోంది. మధు ప్రాణంతో తనప్రాణానికి యేనాడో సంబంధం వున్నట్లుగా - దాన్ని యిప్పుడు బలపరచేటందుకేమో నన్నట్లు సరోజ అమితానందంతో మధు గదిగి చేరుకుంది.

5

మధు నిర్జీవ శిలాప్రతిమలాగా వుండటం సరోజకు యేంతోచలేదు. పెదిమల చివరలనుండి, చొల్లు కారుతోంది. తలంతా చెరిగిపోయింది. అతను అనుభవించే బాధయొక్క స్వరూప మేమిటో కచ్చితంగా సరోజకు తెలియటంలేదు. ఎలా నటిస్తే సంతోషిస్తాడో - లేకపోతే బాధను పెంచినదాన్నా తానేమో నని జంకింది. నిరాశలో మునిగిపోయిన ఆత్మను తేల్చి, సంతోషసాగరంలో అభిషేకం చేయించాలని సరోజకు మెల్లగా తట్టింది.

కాసేపు అలాగే అతనికెదురుగా నిలబడింది. అతనింకా కళ్లు తెరవలేదు. సరోజ మనసులో యేమో ఆలోచనలు ముసురుకొని వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎక్కువసేపు నిలబడలేక, పెనగ్గా వున్న కుర్చీని దగ్గరగా లాక్కొని మధుకు అందుబాటులో కూర్చుంది. ఏదో బరువు కనురెప్పల్ని లేవనీయకుండా అణచివేస్తోందా అనిపిస్తోంది - సరోజకు. వేడి నీరు ఊరికే ధారాపాతంగా కనుచివరలనుండి కారుతోంది - సరోజకు నటించబోతున్న పాత్రకు యిదే మొదటి పని కాబోలనుకుంది. అందుకే అతనిదగ్గరగా జరిగి, తన పమిటిచెంగుతో కారుతున్న కన్నీళ్ళను సున్నితంగా తుడిచింది.

మధు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు.

సరోజ రూపం స్పష్టంగా కనిపించలేదు.

మరింత ప్రయత్నంతో బాగా కనులు విప్పి చూశాడు. ఆ చూపుకి సరోజ కళ్లు చెమర్చినయి. ఇది నటన కాదు నిజంగా వాటంతటి కవే చెమర్చినయ్.

మధుకి, అంతనీరసంగా వున్న సరోజను చూడగానే, ఆమె చర్యను అనుభవించంగానే ఒక్కసారిగా ఆశ్చర్యం కలిగింది.

అలాగే—దీనవదనంతో—బాధగా సరోజ కళ్లలోకి చూడసాగాడు.

సరోజ ఆచూపుకి కంపించింది—

మధు దృష్టిలో ఆమెను దేవతగా భావించి చూస్తున్నాడు.

తన కనుకొలకువెంట దిగజారిన నీటి బిందువులను సరోజ తన మునివ్రేళ్ళతో తుడుచుకొంది—

అవ్యక్తమైన మధుర భావనలో, అనిర్వచనీయమైన సుందరమూర్తిని అవలోకించినప్పుడు పల్కరించాలనే ఆశకలిగినట్లుగా భావించి—

“సరోజనీ...” అన్నాడు మధు.

సరోజని—అతని మొగంలోకి చూస్తూ, తియ్యగా “ఊఁ”—అంది.

ఆ సమాధానంతో మధుకి బ్రతకాలనిపించింది. “తన మీద దయ చూపించే హృదయాలు యింకా వున్నయ్యనుకున్నాడు. ఉండి కూడా చావుకు తాను పురోగమించటం తనకే చిన్నతనమనిపించింది. యిన్నాళ్లూ యీ లోకం న్యాయం—దయ—జాలీ - లేక గొడ్డుపోయిందనుకొన్నాడు. జీవితమంటే నిరాశాపూరితమైనదనే అనుకున్నాడు. ఈ సృష్టంతా మాయ అని, బ్రతుకంతా అశాశ్వతమని నమ్మాడు. కాని, యీ క్షణంలో, ప్రతీదీ శాశ్వతమనీ, ఆనందించ తగ్గది యింకా చాలా వుందని ఊహించాడు. చనిపోతున్నా ఆశ మానవుణ్ని వెంటాడుతుంది. నరకానికి పోవడం యిష్టంలేక స్వర్గాన్ని కోరుకుంటాడు. దానికోసం పుణ్యకార్యాలు చేయడం మొదలెడతాడు. ఆశ యీ విధంగా మానవునిణ్ణి లోబరుచుకొంటుందని మధు భావించాడు” మళ్ళా నిరాశ అతన్ని బెదరించింది.

“అసలీసరోజని ఎవరు? చావాలని కారుక్రింద పడ్డప్పుడు చంపకూడదు! తన హృదయంలోని దయను, సానుభూతిని రంగరించి తనకి యెందుకు పులుముతోంది? నా ప్రాణాల్ని నిలబెట్టి ఏం కీర్తి సంపాదించుకోదల్చింది! ఈ వేళ సరోజని తనకు మనస్ఫూర్తిగా సేవచేస్తోంది! ఎందుకని? ఆపదలో వున్నాననేగా! ఇది కాస్త తప్పిం తరువాత సరోజని చేతులు తుడుచుకోకుండా వుంటుందా! మళ్లా తను రోడ్లవెంటా—దుమ్ములోనూ — పార్కుల్లోనూ— ఆకలి దప్పుల్లోనూ — ఆశల ఉరిత్రాళ్ళలోనూ— చిక్కి, బక్కపీనుగైపోక తప్పదుగా! యెందుకొచ్చిన ముచ్చటలు! యెందుకింతశ్రమ! నన్ను బాగుచేద్దామని యీమె ప్రయత్నించడమేగాని, వాస్తవంగా తన బ్రతుక్కి హాయి, స్వేచ్ఛ, సమకూరుతాయా! ఒక వేళ యీమె పుణ్యంవల్ల బ్రతికినా, సాధించే దేముంది?”

మధులో యింత ఆలోచన విభిన్నరూపాల్లో, వింత వింతచర్యగా సాగిపోతుంటే—సరోజని తనని పరీక్షగా చూస్తూ!—

“కాస్త మందు పుచ్చుకొంటారా!”—అంది.

సరోజని, తనను బ్రతిమలాడి, బుజ్జగిస్తున్నట్లుంది. ఇంతవరకు తనతల్లి పోయినతరువాత, యిలా వినటం యిదే మొదటిసారి తనకి.

మనిషి, మనిషిని ప్రేమిస్తాడు. హృదయంలోని భావా లన్నింటిని, యెదుటివ్యక్తికి పరిస్థితుల్నిబట్టి ధారపోస్తాడు. అభిమానం చూపుతాడు. ఆలింగనం చేసుకుంటాడు. తన కళ్ళను యెదుటివాని కళ్లతో కలుపుతాడు. తను నమ్ముతాడు. ఎదుటివాణ్ని నమ్మిస్తాడు. తనునవ్వుతాడు—నవ్విస్తాడు— అన్నీ మానవునిలోని భావాలే. అంతా మానవత్వంలోని మహాత్వమే! ప్రకృతిలోని ప్రతి గొప్పవిషయమూ, ప్రతి చిన్నవిషయమూ, ప్రతి సన్నివేశంలోనూ, ప్రతిసమ్మేళనంలోనూ వ్యక్తీకరిస్తూనే వుంటాడు— బయటపెట్టుతూనే వుంటాడు. ఇది దాచినా దాగదు. ఇలా దాగని వస్తువుల్నె తనమీద వేసి రుద్దుతోందని మధు భావించాడు. ఈభావనకు బాధ్యురాలు మధు దృష్టిలో 'సరోజనే' స్ఫుటంగా కనిపిస్తోంది. కనురెప్పలు అల్లల్లాడిస్తూ సరోజనివంక చూశాడు.

"ఏంకావాలి" అన్నట్లు సరోజని ఆతృతిగా చూస్తోంది. పేరుపెట్టి పిలిచాడు మధు.

"ఊఁ!"—అంది సరోజని వంగుతూ—

"ఇదంతా యేమిటో నీకు తెలుసా!" వేదాంతిలాగా అన్నాడు మధు.

సరోజనికి నమ్మిన కాళ్లక్రింద భూమి క్రుంగిపోతున్నట్లనిపించింది.

"ఇదంతా వృధాశ్రమ— నా అప్రయోజకత్వం—నా నిరాశ—నా బాధ—నా కష్టాలు—నువ్వనుకున్నంత తేలిగ్గాపోవు — అవి నాకు సన్నిహితాలైనాయి. నువ్వెంతకష్టపడి పరిచర్యలు చేసినా అవి నన్ను విడిచి వెళ్లలేనంతటి మమకారాన్ని నావద్ద దాచుకుని బ్రతుకుతున్నయి"—మధుమూల్గుతూ—ఆగి--ఆగి అన్నాడు.

సరోజనికి అతని మాటల్లో గల నిస్పృహ—మరిగిపోయిన విహ్వలత - పట్టుదల - గాఢంగా వున్నట్లు కనిపించాయి. వాటిని గురించే తానూ దీర్ఘంగా ఆలోచిస్తోంది. కాని అతనితో వాటిని చర్చించడానికి ఆమె పూనుకోదల్చలేదు.

ఏం చెపితే అదివిని వూరుకోవడమే ప్రస్తుతానికి మంచిదని ఊహించింది.

"నాకు బ్రతకాలని లేదు. చావుని కోరుకొంటున్నాను. యేదైనా నీకు ఉపకారం చేయాలనివుంటే- అది చావుని త్వరలో తెప్పించేదిగా వుండనియ్యండి. నా చావుకి అడ్డుతగలొద్దు"—

సరోజని ప్రక్కనేవున్న సెమిలి విసనకర్రతో విసురుతూ—ఆ మాటలు వింది.

అతని మీదవున్న దుప్పటి కుడిచేత్తో సర్దుతూ—

"మధూ! యేమిటీ యింత నిరాశ చెప్పు!" అంది తియ్యగా—

"నా కెవరున్నారు ?" — "యిదివరకు మా అమ్మ వుండేది!"

"ఇప్పుడు?"—అతను ప్రశ్నార్థకంగా చూసాడు.

"నే లేనూ! మధూ!"—

"నువ్వా!" అతను వెకలిగా నవ్వాడు. ఆ నవ్వులో జీవంలేదు. ఎండిన తాటాకు నవ్వులావుంది.

"ఉద్యోగం - ఆరోగ్యం - అమ్మ—" అన్నీ పోయినయి. యింకా నాకేం మిగిలింది? నే నెవరికోసం మిగిలివున్నా!"—మధు కళ్లలో నీళ్లు తిరిగినయి.

సరోజ అతని నుదురురాస్తూ—

"నాకోసం మధూ! నువ్వేం కంగారు పడకు! అంది.

అతనికి ఆమాటలు నమ్మకంగా కనిపించలేదు.

"నీ కోసమా!"—

"అవును...మరి..."

"ఎంత చిన్నపిల్లలాగా అంటున్నావ్! నీలో యింకా అమాయకత్వం పోలేదు. నిరాధారుడైన యీ నిర్భాగ్యునిమీదనా! నీకు తీరని దయ. అందుకని బ్రతికించదల్చావా!"—

"మీరలా అనకండి! మీ కోసం సర్వవిధాలా శ్రమపడి బ్రతికించుకుంటాను. మీ కోసం నాసర్వస్వం వెచ్చించి మీ ప్రాణాల్ని నిలబెట్టుకుంటాను"—

"సరోజనికి తెలియకుండా నే సరోజని హృదయంలోనుంచి ఈ మాటలు బయటికి వచ్చేసినై.

"ఎంత ధైర్యంతో అంది! యిదంతా సత్యమేనా! యింత బాధ్యత తనపట్ల యెలా తీసుకోగల్గింది! యింతగా హృదయాన్ని తనజీవితం చిగురింప చేసేందుకు త్యాగంచేస్తుంటే, తన ఆత్మకు ఆనందాన్ని కూర్చ తల్చుకొంటుంటే.— నే నెందుకు అమెకోసం బ్రతకూడదూ? " అనిఅనిపించిందిమధుకి—వెంటనే "సరోజా!"—అన్నాడు.

ఆ మాటలో సరోజకు యెంతో ఉత్సాహం కన్పించింది.

అతను చిన్నగా నవ్వాడు ఆమెవంక చూసి.

సరోజకు ఆత్మ వికసించింది.

"నువ్వంటే నాకెందుకో నమ్మకంగా వుంది సరోజా!"

"మంచిదేగా!"—

"ఏది మంచిది?"—

"మీరు నన్ను నమ్మటం"—

"అది కాదూ! నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా!"—

సరోజకు తన 'నటన' మీద విశ్వాసం - నమ్మకం కుదురుతోంది.

"యోగ్యుడైనవాడు యెప్పుడూ ప్రేమించబడతాడుగా మధూ"—అంది సరోజ.

ఆ మాట అంటూంటే సరోజకు కన్నులు మురిసినయి.

మధుకి మధువుని నాకినట్లనిపించింది.

"ప్రేమకు ప్రత్యేకంగా కారణా లేమీ వుండవనుకొంటా! అసలు ప్రేమించడ మనేది మనం ప్రయత్నిస్తే అయ్యేది కాదు"—.

"నిజమే నేమో"—అనిపించింది మధుకి.

"ఇంతకీ నేను బ్రతుకుతానా?"

"అదేమిటే - తప్పకుండా!" - అంది సరోజ నిమ్మదిగా. మధుకి బ్రతుకుమీద ఆశ—విశ్వాసం కల్గింది—

"నే చెప్పినట్లు వింటే మరి..."

"నువ్వు నాపట్ల దైవస్వరూపిణివి. క్రొత్త జీవాన్నేదో నాలో ప్రవేశపెట్టావ్"—అన్నాడు మధు కృతజ్ఞతతో. ఇంతలో పనిచేసే మనిషి కాఫీ తెచ్చింది. సరోజ మధుకి త్రాగమని అందించింది. కాస్త చప్పరించి తృప్తిపడ్డాడు.

తరువాత సరోజ నెమ్మదిగా లేచి, మేడమెట్లు దిగి క్రిందకు వెళ్లింది.

సరోజ తండ్రి ఎదురుచూస్తూ కూర్చున్నాడు అప్పటికి.

"రెండు రోజుల్నుంచీ నువ్వు రాకపోయేటప్పటికి నేనే వచ్చానమ్మా!" అన్నాడు తండ్రి.

సరోజ తండ్రి వెంకట్రావు టి. బి. వల్ల వూరవతల ప్రశాంతంగా ఒకచోట డాబాలో వుంటున్నాడు. అప్పుడప్పుడు సరోజ రఘూను వెంటతీసుకొని, తండ్రిని చూడ్డానికి వెళుతూవుండేది. ఇలా ఒకనాడు వెళ్లి వస్తూండగానే మధు సరోజ కారుక్రింద పడటం జరిగింది.

ఈ విషయాన్నంతా సరోజ తండ్రికి తెల్పింది. వెంకట్రావు మధుని గురించి విని, జాలిపడ్డాడు. ఒక్కగానొక్క కూతురైనప్పటికి, ఆమె చూపిన దయకు—సానుభూతికి మెచ్చుకొని, మధుని చూడటానికి పైకివచ్చాడు—

మధుని పరిచయం చేసింది సరోజ.

అతను కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించాడు. వెంకట్రావు అతని వినతికు, గౌరవానికి తృప్తిపడి కాసేపుండి, ఆ మధ్యాహ్నం స్వస్థానానికి వెళ్లిపోయాడు.

6

వారం రోజులు యిట్టే గడిచిపోయాయి.

మధుకి సరోజను చూస్తూ, తృప్తిపడటం ఒక కళాభ్యాసంగా మారిపోయింది.

ఆ రోజు సాయంత్రం వచ్చి డాక్టరు రఘు 'ఎలా వుంటున్నాడు'—

"మీ దయవల్ల"—అంటూ నమస్కరించాడు.

"తప్పకుండా నయమవుతుంది. ఫర్వాలేదు" అన్నాడు రఘు.

మధుకి తేలికనిపించింది బ్రతుకంటే.

"నిరాశపడకుండా చూసుకో!" అని సరోజకు చెప్పి రఘు వెళ్లిపోయాడు.

మధుకి లేచి తిరగాలనిపించడం మొదలెట్టింది.

ఈ వారంరోజులబట్టీ సరోజని చేస్తున్న సేవకు మధుకి బ్రతుకుమీద మమకారం—ఆశ పుట్టినయి

సరోజ తీరిక వేళల్లో మధు దగ్గరగా కూర్చొని, యేవో కబుర్లు చెప్పతూవస్తోంది—అతను అన్నింటికి బద్ధుడై సరోజ సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ యేవో కలలు కంటున్నాడు.

ఆరోజు రాత్రి సరోజ, అతను నిద్రపోయిం తరువాత, తన 'నటన' గురించి తానే సమీక్షించుకొంది. ఇదంతా యిలా జరగటం, అతనిపట్ల అపచారమేమో! అని భయపడింది. కాని అతనిమీద వున్న ఆశే, తననిట్లా చేయిస్తోందని ఆమెకు మనసులో రేఖగా తోచింది.

తెల్లవారింది.

సరోజ మామూలుగా కాఫీ అందించింది.

"నే నెప్పుడు లేచి తిరుగుతానని చెప్పాడూ డాక్టరు?" అన్నాడు మధు.

సరోజ నవ్వింది. జీవితమంటే భయపడి చావుకి దారితీసిన నిర్భాగ్యుడు. నిరాశాపూరితుడు—బ్రతుకు

విలువ తెలుసుకోలేక భయపడినవాడు. ఈ ప్రపంచంలో ఇంతకాలం ఇంకా వుండటం, ఆమె నవ్వుకి కారణం?

"డాక్టరు తిరగమనందే తిరగడానికి వీల్లేదు!" అంది శాసనపూర్వకంగా—

"ఎందుకని"—అన్నాడు మధు.

"ఎందు కేమిటి!—అంతే"—

"అదేమిటే! నాలో తిరిగే శక్తివుంటే తిరక్కూడదా!" మంకు పట్టుదలతో అన్నాడు మధు.

ఇంతలో రఘు వచ్చాడు.

"ఎలా వుంది—మధూ!" అన్నాడు.

"నేను తిరగొచ్చా!" అని అడిగాడు.

"ఇంకా నాలుగైదు రోజు లాగిన తర్వాత—"

"అంతవరకూ యేం చెయ్యను?"

"సరోజ వుందిగా—" అంటూ సరోజవైపు చూశాడు రఘు.

ఆమె ముద్దుగా నవ్వింది.

మధు ఆమెవంక చంటిపిల్లవాడిలాగా చుస్తూ!—

"నువ్వు యెక్కడికీ వెళ్లకు సరూ! యేదైనా చదివి కథలు చెప్పాలి — లేకపోతే నాకేంతోచదు" — అన్నాడు.

"అలాగేలే—మధూ"—అంది సరోజని.

మధు లేచేవరకు ఆమె అన్నట్లుగా సేవచేసింది—మధు యేవో ఉబుసుపోకగా అడిగేవాడు. ప్రేమసీ పలుకులకన్నా తియ్యగా సమాధానాలు యిస్తూండేది మధుకి.

మధు హృదయం సరోజ సల్లాపాల అమృతంతో నిండిపోతోంది.

ఒకనాటి రాత్రి మధు ఒంటరిగా లేచి గదిదాటి వసారాలోకి వచ్చి, కుర్చీలో చతికిలపడి కూర్చొన్నాడు.

అప్పుడు సరోజ యేదోపనిమీద క్రిందకు దిగివెళ్లింది. అరగంటయిన తర్వాత సరోజ వచ్చిచూసింది.

మధు, విరియగాసిన వెన్నెల్లో—కదలని రమ్యమైన ప్రకృతిని, అవలోకిస్తూ యేదో పునశ్చరణ చేసుకొంటున్నాడు.

సరోజ అడుగులచప్పుడికి మధు చలించి చూశాడు. ఆమె నవ్వుతూ మధుదగ్గరగా వచ్చినిల్చుంది — ఆమెకళ్లల్లోకి, మధు చూస్తూ—

"యెక్కడికి కెళ్లావు సరోజా!" అన్నాడు—

"మీకు కాఫీ తేవాలనివెళ్లా"నంది—

"త్రాగి త్రాగి నోరంతా చేదెక్కిపోయింది. కాఫీ అంటే విసుగ్గూడాపుట్టింది. దాని పేరెత్తితే చిరాకెత్తుతోంది"—అన్నాడు ముఖం చిట్లించుకొంటూ.

"పోన్లెండి. ఇప్పుడు త్రాగద్దులే"—అంది అతని అయిష్టాన్ని గ్రహించి—

మధు ఒక్కసారి ఆమెస్వరూపాన్ని బాగాచూశాడు. "పండువెన్నెల్లో తనకోసం కలలుగనే సరోజ. రేగిన ముంగురుల్లో దోబూచులాడే కోలమొగం, నవ్వితే బుగ్గన చొట్టబడే నవయువ్వనం—" మధుని వుక్కిరిబిక్కిరిచేసినయి. అలాగే చూస్తూండడంతో, సరోజకు యేదో అనిర్వచనీయమైన మధురభావం తట్టింది—

"యేమిటలా చూస్తున్నారు!" అంది--చిరునవ్వుతో.

"యేమీ లేదు."—

"ఏమీ లేకపోతే యెందుకట్లాచూస్తారు నా మొగాన్ని"

"సరోజా!"—

"ఊఁ—"

"ఇలాకూర్చో! ఒక్కమాట!"—

సరోజ ప్రక్కనేవున్న కుర్చీలో కూర్చుంది —

"ఏమిటది?"

"నీ సౌందర్యం నన్ను మళ్ళీ బ్రతికించింది. విసుగెత్తిన లోకానికి మళ్ళీ విందుచేస్తున్నా! ఆశతో పెనవేసుకొన్న హృదయానికి నీ ప్రేమవల్ల నీరాంజనాలు సమర్పిస్తున్నా!"

"ఏమిటే కవిత్వం చెబుతున్నారు!"—అంది.

"కవిత్వంకాదు సరోజనీ, ఒకప్పుడు మనిద్దరం కాలేజీలో నాటకం వేశాం గుర్తుందా! అందులో నా పోర్షన్‌లోని యీ మాటలు యింకా నేమర్చిపోలేదు. ఈరోజు మళ్ళీ జ్ఞాపకానికి వస్తున్నయి నిన్ను చూస్తుంటే"—

"ఒక్కరే లేచి యెలా వచ్చారు."—

"నిద్రపట్టలేదు యెంతసేపు కళ్ళుమూసినా! ఇంత వెన్నెల వృథాగా మరిగిపోవడం నాకెంతో చిన్నతనమనిపించింది.

సరోజని శరీరం ఒక్కసారిగా పుల్కరించింది. అణగివున్న కోరికలు చిగురులెత్తాయి. ఆమని కోయిలతనలో మధుర రాగాలాపన చేసినట్లనిపించింది. నవవసంత సుమమాలనైపోయానని పించింది — మధు చూస్తున్న

చూపుల్లో ఆమెకు అర్థంకాని అనుభూతులు గోచరించాయి-పల్కరించాయి-ద్రవించాయి.
"రఘు లేవద్దంటే యెందుకు లేచారు?" అంది పైకి.
"అలాగే అంటారు లేవడానికి యిష్టంలేక—వాళ్లకేం తెలుస్తుంది రోగిబాధ—అవస్థ"—
"అలా అనకండి! డాక్టరు చెప్పినట్లు వినాలి"—
"ఏంటే—యింకా యేడిపిస్తారు....ఓపిక వున్నప్పుడు యెలా పడుకోను."
"ఇంత పెంకెతనం—పనికిరాదు!"—
"నీకు తెలియదు సరోజా! బాధ వ్యక్తిని పరీక్షిస్తుందనుకొంటారు డాక్టర్లు. కాని నాకేమో అదంటే ప్రస్తుతం నమ్మకం లేదు సుమా!"—
సరోజ అతని మనస్తత్వం యింకా గ్రహించలేదేమో!
మధు నిశ్చింతగా— నిర్మలంగా—నిష్కల్మషంగా చూస్తున్నాడు సరోజను.
ఆమెకేదో సిగ్గు వచ్చింది.
"ఎందుకలా చూస్తారు?" అంది.
"నాకిష్టమైంది అదొక్కటే"—అన్నాడు మధు.
"ఏమిటీ మరీను!"—సిగ్గు బాధ మతిమీరింది.
"ఏముంది—చాలా చిక్కిపోయావు నామూలంగా!"-అంటూ ఆమె బుగ్గల్ని స్పృశించాడు తన మునివేళ్ళతో—
ఆమెకు నవనాడులూ జలదరించాయి.
మంచు మూలంగా—యిద్దరి శరీరాలు చల్లబడ్డాయి.
"నిద్ర రావడంలేదా!" అంది—
"జోల పాడితేగా"—సరోజ ప్రియుడంటే యిలాగే మాట్లాడుతాడనుకొంది.
ఆరాత్రి మధు సుఖంగా సరోజను చూస్తూ నిద్రపోయాడు.

7

తెల్లవారింది.
రఘు మామూలుగా వచ్చాడు.
సరోజ జరిగిన విషయమంతా చెప్పింది.
ఆశ్చర్యపడ్డాడు రఘు.
చావుబ్రతుకుల సమస్యలు చాలావరకు రోగిమీదే ఆధారపడివుంటాయనుకొన్నాడు. తన మందువల్ల బ్రతికినాడనుకోవటం కంటే, సరోజని ఉపచర్యవల్ల తేరుకోగల్గాడని, తృప్తిపడటం సమంజసమనిపించింది. ఆరోజే రోగిని అన్నం తినిపించాలనుకొన్నాడు రఘు. సరోజని 'సరే' అంది.
మధు ఉర్రూతలూగిపోయాడు.
తన నటన, వాస్తవిక జీవితానికి నాంది ప్రస్తావనగా అవుతుందని సరోజని కలగనలేదు. కల నిజమైంది. మధు హృదయాన్ని నమ్మించినందుకు, అతను తనవల్ల పునర్జన్మ యెత్తినందుకు, తన ప్రేమకు అంతస్థులు లేకపోవడంవల్లనూ, జీవితంలో మధుతోబాటు సహకరించడానికి సంసిద్ధురాలై, వెంకట్రావుతో మధు విషయాన్ని, అతనిపట్ల తన మనోభిప్రాయాన్ని, వెల్లడించుకొంది—
వెంకట్రావు సరోజ మాటల్లోగల యథార్థాన్ని అవగాహన చేసుకొని కాదనలేకపోయాడు—
మధు నేత్రాలలో సరోజ హృదయం పుప్పొడి రాల్చింది.
రఘు చేసిన ఉపకారానికి సరోజని ప్రతిఫలం సమర్పించుకొంది—కాని, తనపట్ల సరోజని యీ విధంగా సత్కరించి, గౌరవించుతుందనుకోలేదు—ఆమె పంపిన ప్రతిఫలాన్ని పరీక్షగా చూస్తూ, అందుతునల్ల హాయిని జారవిడుచుకొన్న వాడిలాగా మొగం పెట్టి నిర్వేదించాడు.